క్లుప్తంగా

నేటి నుంచి స్వచ్ఛతా పక్వాడ్



తెనాలి: పాఠశాలల్లో 15 రోజులపాటు నిర్వహించాల్సిన ‘స్వచ్ఛతా పక్వాడ్’ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి, ప్రజల భాగస్వామ్యంతో వివిధ రకాల పరిశుభ్రతా చర్యలను చేపడతారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, చేతులు కడుక్కోవడం, మాస్క్ ధరించడం, మరుగుదొడ్ల వినియోగం, నీటి పొదుపు, కోవిడ్ నివారణకు జాగ్రత్తలు, ప్లాస్టిక్ నిషేధం, దివ్యాంగ విద్యార్థుల అవసరాలపై అవగాహన...వంటి అంశాలను ఇందులో చేర్చారు. చివరిరోజైన ఈనెల 15వ తేదీన ప్రతిభ చూపిన విద్యార్థులు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేస్తారు. స్వచ్ఛతా పక్వాడ్‌లో భాగంగా శుక్రవారం పట్టణ అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వచ్ఛతా శపథం చేశారు. అసెంబ్లీలో ఉపాధ్యాయుడు మనోజ్‌కుమార్ ఈ ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం ప్రసూనాదేవి స్వచ్ఛతా పక్వాడ్ ఆశయాన్ని వివరించారు. విద్యాకమిటీ చైర్మన్ ఎం.రాజు, పీఈటీలు హరినాథ్, శ్రీనివాస్, ఆంజనేయశర్మ, ప్రసాద్, ఎస్.శ్రీనివాస్, ప్రేమ్, రబియా బాసం, జాన్‌బీ, విజయ్‌సింహా, కరిముల్లా, సునీత, వీరరాజు, సుజాత, వెంకటరమణ, ప్రకాశరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి



దాచేపల్లి : విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని పౌరసరఫరా సంస్థ డైరెక్టర్ కెబిఎస్ ప్రగతి అన్నారు. నగర పంచాయతీలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్, కేసానుపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. తయారు చేసిన ఆహార పదార్థాలు పరిశీలన చేసి స్టోర్ రూమ్‌ను కూడా తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్నం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రగతి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రుచికరమైన ఆహార పదార్థాలు అందించేందుకు కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తున్నారని, విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాల తయారీలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో ఎంఈఓ పినకపాని, ప్రిన్సిపల్స్ రవికుమార్, శాంతి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులున్నారు.

విద్యజ్యోతి నగదు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ



తెనాలిఅర్బన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా తెనాలి గాంధీచౌక్‌లోని కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీలకు శుక్రవారం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 6,7 తరగతులు ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రూ.2500, 8,9, 10 తరగతి చదివే విద్యార్థులకు రూ.5000వేలు చొప్పున పంపిణీ చేశారు. కొత్తపేటలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలకు చైతన్య విద్యార్థుల ఎంపిక



తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలకు గంగానమ్మపేటలోని శ్రీ చైతన్య ఇంగ్లిషు మీడియం స్కూల్ విద్యార్థులు అండర్-17విభాగంలో ఎంపికై నట్లు ప్రిన్సిపల్ రాధా తెలిపారు. కన్యకాపరమేశ్వరి దేవస్థాన ఆవరణలో ఎంపిక నిర్వహించినట్లు చెప్పారు. ఎంపికై న విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ఆవరణలో అభినందిచారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి జంప్ రోప్ అసోసియేషన్ కార్యదర్శి జయరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పురోగతిలో సమగ్ర భూసర్వే

- దేవరపల్లి సేరిలో హద్దురాళ్ల ఏర్పాటు
- సంగంజాగర్లమూడిలో క్షేత్రస్థాయి సర్వే పూర్తి
- నాలుగు గ్రామాల్లో వేగవంతంగా సర్వే



దేవరపల్లి సేరిలో ఏర్పాటైన హద్దురాయి వద్ద తహసీల్దార్ రవిబాబు

తెనాలి: తెనాలి రూరల్ మండలంలో సమగ్ర భూసర్వే వేగం పుంజుకుంది. తొలి దశ ఎంపికచేసిన గ్రామాల్లో డ్రోన్‌తో గణాంకాల నమోదు ఇప్పటికే పూర్తయిన విషయం తెలిసిందే. రెవెన్యూ అధికారుల బృందాలు క్షేత్రస్థాయి సర్వేలో నిమగ్నమై ఉన్నారు. ప్రతి సర్వే నంబరుకు వెళ్లి, భూమిపై ఎవరు హక్కుదారులు ఉన్నారు...చనిపోయిన రైతులు ఎవరైనా ఉంటే, వారి వారసులు ఎవరు అనుభవిస్తున్నదీ పరిశీలన చేస్తున్నారు. హద్దుల నిర్ధారణ చేస్తున్నారు. దేవరపల్లి సేరిలో హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. ఇదే నెలలో తొలి దశ రీసర్వే పూర్తవుతుందని అధికారులు వెల్లడించారు.

సమగ్ర భూ సర్వే....

సమగ్ర భూ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే.

దాదాపు వందేళ్ల తర్వాత జరుగుతున్న సర్వేలో అక్షాంశ, రేఖాంశాల సహితంగా ప్రతి ఒక్కరి పంట పొలానికి పక్కా సరిహద్దులు నిర్ణయించి, హద్దు రాళ్లు ఏర్పాటుచేయనున్నారు. తెనాలి మండలంలో 13 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటిలోని 18 సచివాలయాల పరిధిలో మొత్తం 29 వేల ఎకరాల భూమికి సంబంధించిన సమగ్ర సర్వేను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా తొలి దశలో ఆరు గ్రామాలను ఎంపిక చేశారు. నందివెలుగు (1160 ఎకరాలు), సంగంజాగర్లమూడి (924 ఎకరాలు), గుడివాడ (1862 ఎకరాలు), కఠెవరం (4,091 ఎకరాలు), పినపాడు (710 ఎకరాలు), దేవరపల్లి సేరి (27 ఎకరాలు)లో సమగ్ర సర్వేకు రెవెన్యూ యంత్రాంగం శ్రీకారం చుట్టింది.

మొత్తం 18 బృందాల ఏర్పాటు...

సమగ్ర సర్వేకు మొత్తం 18 బృందాలను ఏర్పాటుచేశారు. వీఆర్వో, సర్వేయరుతోపాటు సచివాలయ, ఇతర సిబ్బందిని ఈ బృందాల్లో నియమించారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే డ్రోన్‌తో గణాంకాల నమోదు చేశారు. అనంతరం క్షేత్రస్థాయి సర్వే చేస్తున్నారు. అధికారుల బృందాలు ప్రతి సర్వే నంబరుకు వెళ్లి భూమిపై ఎవరు ఉంటున్నారో తెలుసుకుంటున్నారు. చనిపోయిన వాళ్లుంటే వారి వారసులతో దరఖాస్తు చేయిస్తున్నారు. భూమి కొనుగోలుదార్ల చేతుల్లో ఉంటే వారిచేత అర్జీ పెట్టిస్తున్నారు. సర్వే నంబర్ల ప్రకారం హద్దు రాళ్ల నిర్ధారణ (గ్రౌండ్ వాలిడేషన్)కు రోవర్లను వినియోగిస్తున్నారు. ఆరు గ్రామాల్లో తొలిగా 27 ఎకరాలు కలిగిన దేవరపల్లి సేరిలో 59 ఎల్‌పీఎంలు వచ్చినట్టు మండల తహసీల్దార్ కె.రవిబాబు వెల్లడించారు. ఆ ప్రకారం హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో తొలిగా హద్దురాళ్ల ఏర్పాటు ఇక్కడ చేసినట్టయింది.

ఎల్‌పీఎం ధృవీకరణ అంటే...

హద్దురాళ్ల నిర్ధారణ తర్వాత సర్వే నంబరు స్థానంలో సంబంధిత రైతులకు ‘ల్యాండ్ పర్సన్ మెంబర్’ (ఎల్‌పీఎం) ధృవీకరణ ఇస్తారు. ఇంతకుముందు ఒక వ్యక్తికి గల భూమికి రెండేసి, మూడేసి సర్వే నంబర్లలో ఉండడం తెలిసిందే. ఈ విధానానికి భిన్నంగా ఒక రైతుకు ఒక ఏరియాలో వేర్వేరుగా ఎంత విస్తీర్ణంలో భూమి ఉన్నప్పటికీ అన్నీ కలిపి ఒకే ఎల్‌పీఎం నంబరుతో ఇస్తారు. వీఆర్వో, సర్వేయరు రైతులను కలిసి సంబంధిత పత్రాలను చూపుతారు. రైతు దగ్గరున్న పత్రాలతో పోల్చుకుంటారు. రైతు అంగీకారంతో ఎల్‌పీఎంను జారీచేస్తారు. కోర్టు వివాదాలు, కుటుంబ వివాదాలు ఉన్న భూముల అంశాన్ని పెండింగులో ఉంచి, మిగిలినవన్నీ పరిష్కరించి, ఎల్‌పీఎంతో సహా నూతన పట్టాదారు పుస్తకాలను ఇస్తారు. ఇందులో భూమి హద్దులు, స్కెచ్‌లతో సహా పక్కాగా ముద్రించి ఉంటాయి. ఆరు గ్రామాల్లో ఎల్‌పీఎంలు పరిష్కారమయ్యాక, ఇతర గ్రామాల్లో సమగ్ర సర్వేను కొనసాగిస్తారు.

ఈనెలలో తొలి దశ పూర్తికి కృషి

సమగ్ర భూముల రీసర్వే క్షేత్రస్థాయిలో ఈ నెలలో పూర్తికానుంది. సంగంజాగర్లమూడిలో ఇప్పటికే పూర్తికాగా, పినపాడులో ఏడురోజుల్లో, నందివెలుగులో రెండు వారాల్లో పూర్తిచేస్తాం. గుడివాడ, కఠెవరంలో ఈనెలాఖరుకు సర్వే చేసి తొలి దశ లక్ష్యాన్ని సాధిస్తాం.

కె.రవిబాబు,
మండల తహసీల్దారు, తెనాలి

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు యడ్లపల్లి విద్యార్థులు



యడ్లపల్లి(వేమూరు): గుంటూరు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలోని ఆలపాటి వెంకట రామయ్య జెడ్పీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కుర్రా శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.600మీటర్ల పరుగు పందెంలో అండర్-14 విభాగంలో గుమ్మడి దీపిక, బి.మేఘన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు. 800మీ.లలో అండర్- 16 విభాగంలో వాకా ఉషశ్రీ ద్వితీయ స్థానం, 200 మీటర్లు విభాగంలో డి.ప్రియాంక ద్వితీయ స్థానం సాధించినట్లు వెల్లడించారు. హెచ్ఎం, పీఈటీ శరత్ బాబు వారిని అభినందించారు.

రైల్వేగేటు తెరవకుంటే ఆందోళన

అఖిలపక్ష రైతు సదస్సులో సాధన కమిటీ ఎన్నిక



అఖిలపక్ష రైతు సదస్సులో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తెనాలి: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని రైల్వేశాఖ పొదుపు చర్యల పేరుతో రైల్వే గేట్లను మూసివేస్తూ రైతులు, ప్రజలను ఇక్కట్లపాలు చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని, ప్రజలను చైతన్యవంతులను చేసి ఆందోళన చేపడతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొన్నా శివశంకరరావు హెచ్చరించారు. చినరావూరు-జంపని మధ్య మూసివేసిన రైల్వేగేటును తెరిపించాలని కోరుతూ రూరల్ మండలం జగ్గడిగుంటపాలెం గ్రామంలోని పాతపంచాయతీ కార్యాలయంలో అఖిలపక్ష రైతు సదస్సు నిర్వహించారు. ముద్దన సాంబశివరావు అధ్యక్షత వహించారు. జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ, జిల్లా అధికార యంత్రాంగం, ప్రజలు యావత్తూ మూసివేసిన గేటును తెరవాలని రైల్వే అధికారులకు నివేదించినా, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఢిల్లీ రైతుల ఉద్యమస్ఫూర్తితో గేటు తెరిపించేవరకు దశలవారీ ఆందోళన చేపట్టాలనీ, రైతుసంఘం అండగా ఉంటుందని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రూ.4 కోట్ల నబార్డు నిధులతో రోడ్డు వేసినా రైలు గేటు తెరవకపోవటం దుర్మార్గమన్నారు. గేటు మూసివేసిన కారణంగా చేలల్లో పండిన పంటను ఇంటికి చేర్చాలంటే 7-8 కిలోమీటర్ల అదనంగా చుట్టు తిరిగి రావాల్సి వస్తోందని, ఇందుకు అదనంగా ఖర్చవుతోందని బొంతా ఆంజనేయులు, తాటి భూలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తాటి వెంకటేశ్వర్లు కన్వీనర్‌గా, కుర్రా వెంకటరమణ, కేవీ సత్యనారాయణ, తాటి కృష్ణ తదితరులు 13 మందితో రైల్వే గేటు సాధన కమిటీని ఎన్నుకున్నారు.

ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే శివకుమార్



సంక్షేమ లబ్ధి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: ఆర్థిక అసమానతలు తగ్గించడం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం తొమ్మిదో రోజు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వలకు సైడ్ డ్రైయిన్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గ్రామంలో రెండు ఎంపీటీసీల పరిదిలో ఇంటింటికి తిరిగామని, ప్రజలు సంతోషంగా సమస్యలు తెలిపారని చెప్పారు. రూ.25కోట్ల రూపాయలను ప్రజల బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల నిమిత్తం నేరుగా జమ చేశామన్నారు. సంస్కరణ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. పింఛన్‌లు పంపిణీ వల్ల వికలాంగులు, వృద్ధులు, వితంతువులు ఆనందంగా ఉన్నారని చెప్పారు. చేతి వృత్తులు చేసుకునే వారు, చిరువ్యాపారులకు చేయూత, ఆసరా పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీటీసీలు కాలిశెట్టి ఫణీకుమార్, నాగదేవిక, డిసిఎంఎస్ డైరెక్టర ప్రసాదం బాలగువరమ్మ, సొసైటీ చైర్మన్ గంపల పెద్దబ్బాయి, మల్లవరపు విజయ్, కోడూరి రమేష్, పినపాటి అనిల్, రాజయ్య, తులాబంధుల చినచిట్టి బాబు, కోటేశ్వరరావు, ప్రసాదం సురేష్, షేక్ జిలానీ, కార్తీకేయ, పోలిశెట్టి కోటేశ్వరరావు, ప్రసాదం రాధారావు, కాలిశెట్టి సుబ్బారావు, లక్ష్మారెడ్డి, పామర్తి సుబ్బారావు, కొమ్ము రాయల్, రావూరి రవిబాబు, నలుకుర్తి జోసఫ్, వీఆర్వోలు సురేష్, నితీష్‌కుమార్, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు, వీఏఏ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయ వ్యవస్థ అండగా ఉంటుంది

న్యాయమూర్తి శ్రీసీత



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీసీత

తెనాలిరూరల్: అసంఘటిత రంగ కార్మికులకు అవసరమైనప్పుడు న్యాయ వ్యవస్థ అండగా ఉంటుందని రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత అన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం గంగానమ్మపేటలోని చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో అసంఘటిత రంగ కార్మికులకు న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీసీత మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో అసంఘటిత రంగం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, దేశ జనాభాలో దాదాపు 92 శాతం మంది ఈ రంగంలోని కార్మికులేనన్నారు. అసంఘటిత కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారి కోసం సామాజిక భద్రతా చట్టం 2008 ప్రవేశ పెటారని తెలిపారు.

ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యం అసంఘటిత రంగానికి సామాజిక భద్రత మరియు సంక్షేమాన్ని అందించడమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా కార్మికుల జీవితం, వైకల్యం, వృద్ధాప్యం, గృహ నిర్మాణం, విద్య, ఉపాధి మొదలైన వాటికి అనుసంధానించి పలు పథకాలు రూపొందించాయని చెప్పారు. ఈ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూరుస్తాయన్నారు. ఈ చట్టం ప్రత్యేకంగా అసంఘటిత రంగానికి వర్తిస్తుందని, చట్టం అమలు కోసం దేశ స్థాయిలో జాతీయ సామాజిక భద్రత బోర్డు అలానే రాష్ట్రస్థాయిలో రాష్ట్ర సామాజిక భద్రత బోర్డులు ఏర్పాటు చేశారని చెప్పారు.. ఈ బోర్డులు అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తాయని తెలిపారు. ఇందులో సభ్యత్వం తీసుకున్న వారికి వివిధ సంక్షేమ పథకాలు అందజేయ బడతాయన్నారు. అదే విధంగా అసంఘటిత రంగ వ్యవస్థకు న్యాయవ్యవస్థ కూడా రక్షణ కల్పిస్తుందన్నారు.

చట్టం సక్రమంగా అమలు చేయడంలో బోర్డులు విఫలం అయినప్పుడు కార్మికుల హక్కులను న్యాయ వ్యవస్థ పరిరక్షిస్తోందని, చట్టాలతో పాటు భారత రాజ్యాంగం అసంఘటిత రంగ కార్మికులకు ప్రాథమిక హక్కులు కల్పించిందని చెప్పారు. కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి. శివప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల కోసం ప్రభుత్వం నిర్దేశించిన పథకాలను ఉపయోగించుకోవాలని, వాటిపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పథకాల పట్ల అవగాహన లేకపోతే తమ కార్యాలయానికి వచ్చి సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్లు ఎం.వినయ్ కుమార్, సుభాని, తెనలాఇ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందులవు వేణు గోపాలరావు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్కుమార్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

తెనాలిఅర్బన్: డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. డిపో పరిధిలోని సమస్యలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని చెప్పారు. సెల్‌నెంబర్ : 9959225422లో సంప్రదించాలని కోరారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలిఅర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి బుధవారం లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 31 నాటికి 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు కూడా వర్తిస్తాయని వివరించారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏడు, ఎనిమిది తేదీల్లో దరఖాస్తుల పరిశీలన, 12,13 తేదీల్లో ఇంటర్వ్యూలు, 15న ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటన చేస్తామన్నారు.

ధరలను నియంత్రించాలని వినతి

తెనాలిఅర్బన్: గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలతో పాటు కూరగాయాలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీపీఎం తెనాలి నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు సచివాలయాల్లోని అడ్మిన్‌లకు శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం తెనాలి నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, కె.రవికుమార్, పి.జోనేష్, యేసోబు, రాజ్యలక్ష్మి, ఆశాబీ, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం పరిశీలన

తెనాలిరూరల్: స్థానిక అమరావతి కాలనీలోని ఏఎస్ఎన్ ఇండోర్ స్టేడియాన్ని పలు విభాగాల అధికారులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. స్టేడియంలో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు అక్కడ వాకర్స్‌కు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా పరిశీలన చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాలతో సాయంత్రం స్టేడియానికి వచ్చిన మున్సిపల్ ఇంజినీర్ కె నాగమల్లేశ్వరరావు సహా హౌసింగ్, ఎలక్ట్రికల్ విభాగ అధికారులు సమస్యలు పరిశీలించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోచ్ కె నాగరాజు, సునీల్ పర్యవేక్షించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తెనాలి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించిన అధికారులు సీజ్ చేశారు. తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లె రోడ్డులో ఇసుక ట్రాక్టర్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం, ఆయన సిబ్బంది శుక్రవారం గుర్తించారు. ఎటువంటి బిల్లులు లేకపోవడంతో వాహన యజమానిపై కేసు నమోదు చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం నుంచి ఇసుక తరలిస్తున్నట్టు అధికారులు గుర్తించారు.

సోషల్‌మీడియా పోస్ట్‌లపై ఫిర్యాదు

తెనాలిరూరల్: తెనాలి వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు శుక్రవారం సాయంత్రం త్రీ టౌన్ పోలీసులను కలిశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు కొంత కాలంగా ఫేస్‌బుక్‌లో మైనారీలను కించ పరుస్తూ, దూషిస్తూ అసభ్య పదజాలంతో పోస్టులు పెడుతున్నారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫేస్‌బుక్‌లో ఇబ్బడిముబ్బడిగా ఫేక్ అకౌంట్లను రూపొందించి మైనార్టీలను అసభ్య పదజాలంతో దూషించడమే పనిగా పెట్టుకున్నారని రాత పూర్వక ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరికి కొందరు నాయకులు కూడా సహకారం అందిస్తున్నారని, ఫేక్ అకౌంట్ల ద్వారా పోస్టులు పెడుతూ మైనార్టీలను కించపరుస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దుబాయ్ బాబు, మొఘల్ అహ్మద్, షేక్ నూర్ ఇస్మాయిల్, ఈద్గా ప్రెసిడెంట్ సయ్యద్ గౌస్, కో ఆప్షన్ మెంబర్ పెచ్చింగ్ సుభానీ, పి బిలాల్, ఎస్‌కె సిలార్ భాష, అన్సారీ, ఎస్‌కె సలీం, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస విశేష కుంకుమ పూజలు



చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో అలంకరణలో అమ్మవారు



కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

తెనాలిటౌన్: మారీసుపేటలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు విశేషంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అప్పలస్వామి గుడిలో చండీహోమము, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మానేజింగ్ ట్రస్టీ లంకా శివానంద్‌కుమార్, ప్రధాన అర్చకులు నాగశర్మ, తేజిత్, పవన్‌సూత్ నారాయణ, నిహాల్ శంకర్, మరిపూడి రాంబాబు, ఆలయ కోశాధికారి కూరపల్లి నారాయణ స్వామి, కార్యదర్శి లంకా శివ ఆంజనేయప్రసాద్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి భక్త బృందం ఆధ్వర్యంలో శుభ శ్రావణ మాసం సందర్భంగా అంగలకుదురు గౌడపాలెంలోని అమ్మవారి దేవస్థానంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు.